# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-05-2026　　　　సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- గోదావరి పుష్కరాల్లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
- ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో కోస్టల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ టెస్ట్‌బెడ్ (C-ART) కేంద్రాన్ని కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవిచంద్రన్ ప్రారంభించారు.
- రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఉచిత పీ.ఎం. సూర్యఘర్ సోలార్ కనెక్షన్లు అందిస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- కార్మికులు, కర్షకులే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.
- ద్రోణి ప్రభావంతో రేపు, ఎల్లుండి రాష్ట్రంలో ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

==================

2027 గోదావరి పుష్కరాల్లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన “పేదల సేవ” కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వెయ్యి కోట్ల రూపాయలతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నామని వివరించారు. పోలవరం పూర్తి చేసి కృష్ణానదికి అనుసంధానిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కృష్ణా పుష్కరాల నాటికి కృష్ణా జిల్లాకు నీటి ఎద్దడి లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి బందర్ పోర్టు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పింఛన్ల పంపిణీని బాధ్యతగా భావిస్తున్నామని, వీటి కోసం ఏటా 33 వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నామని, లేబర్ అడ్డాలను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్-మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోందని, విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

===================

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన `మిషన్ మౌసమ్`లో భాగంగా.. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోస్టల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ టెస్ట్‌బెడ్ (C-ART) కేంద్రాన్ని కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవి చంద్రన్ ఈరోజు ప్రారంభించారు. కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో.. పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (IITM) సహకారంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా ఎం. రవి చంద్రన్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న తరుణంలో.. "సీ-ఆర్ట్" వంటి అత్యాధునిక పరిశోధనా కేంద్రాల అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా పర్యావరణ మార్పులను నిశితంగా పరిశీలించి, తీరప్రాంత ప్రజలను ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించేందుకు వీలవుతుందని తెలిపారు. భవిష్యత్‌లో వాతావరణ అంచనాల కచ్చితత్వాన్ని పెంచడంలో ఈ టెస్ట్‌బెడ్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు. ఐఐటీఎం డైరెక్టర్ ఎ. సూర్యచంద్రరావు మాట్లాడుతూ... విశాఖ వంటి వ్యూహాత్మక తీర నగరంలో ఇటువంటి పరిశోధనా వేదికను ఏర్పాటు చేయడం ఎంతో అవసరమన్నారు. వాతావరణ శాఖ, సముద్ర పరిశోధన సంస్థలు, విద్యా సంస్థల సమన్వయంతో వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం పెంపొందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని వెల్లడించారు.

===================

'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా ఈరోజు విజయవాడలోని లోక్ భవన్ లో గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... గుజరాత్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని 'గుజరాత్ గౌరవ్ దివస్'గా జరుపుకుంటారని, గుజరాత్ ప్రాచీన చరిత్ర వేదకాలం నాటిదని పేర్కొన్నారు. దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో సుమారు 15 శాతం వాటాతో మహారాష్ట్ర అత్యంత సంపన్న రాష్ట్రమని గవర్నర్ తెలిపారు. వివిధ రాష్ట్రాల సంస్కృతీ, సంప్రదాయాలను పరిచయం చేయడం, జాతీయ ఐక్యతను పెంపొందించడమే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' లక్ష్యమని వెల్లడించారు.

===================

కార్మికులు, కర్షకులే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శ్రామికులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక పింఛన్లు అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని హోం మంత్రి తెలియజేశారు.

విరామం

===================

సింహాచలం శ్రీ వరహాలక్ష్మీ నృసింహస్వామికి వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని రెండో విడతగా మూడు మనుగుల చందనాన్ని సమర్పించారు. ఈరోజు తెల్లవారుజామున పూజాది కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం చందన సమర్పణ గావించారు. వైశాఖ పౌర్ణమి నేపథ్యంలో పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులతో సింహగిరి భక్తజన సంద్రంగా మారింది.

===================

గుంటూరును ఆకర్షణీయమైన పట్టణంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు నగర పాలక సంస్థ ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో మంత్రి

ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరంలో 22 పార్కుల అభివృద్ధికి 7 కోట్ల 20 లక్షల రూపాయలు కేటాయించినట్లు వివరించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ -3 పనులు వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామని కేంద్ర సహాయ మంత్రి పేర్కొన్నారు.

==================

ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో కార్మికుల కష్టాలు తీర్చి.. భద్రత, భరోసా కల్పించామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ తెలిపారు. కృష్ణా జిల్లా పమిడిముక్కల గ్రామంలో ఈరోజు నిర్వహించిన ప్రజా వేదిక సభలో మంత్రి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల కార్మికులు రాష్ట్రంలో పనుల కోసం వస్తున్నారని వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ సెంటర్లుగా ఐదు నగరాలను ఎంపిక చేశామని.. వీటిని 15 నగరాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించినట్లు తెలిపారు.

==================

జనగణన ప్రక్రియ ఏర్పాట్లను సెన్సెస్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్నకుమార్ కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామ పంచాయతీలో ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి 31వ తేదీ వరకు జనగణన సర్వే జరగనుందని తెలిపారు. ఈ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. స్వీయ జనగణన నిర్వహించిన వారు సంబంధిత సచివాలయాల్లో ఐడిని సమర్పించాలని ఆయన సూచించారు.

==================

రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఉచిత పీఎం సూర్యఘర్ సోలార్ కనెక్షన్లు అందిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో మంత్రి ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2 కిలోవాట్ల వరకు ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచితంగా సోలార్ కనెక్షన్లు అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదన్నారు. కరెంట్ బిల్లులు తగ్గించి.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు.

==================

రాష్ట్రంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఈరోజు 45.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. 20 జిల్లాల పరిధిలోని 252 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించారు. రేపు అధిక ఉష్ణోగ్రతలతో పాటు 64 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ద్రోణి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని తెలియజేశారు.

==================

దక్షిణ ఒడిశా నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా ఏర్పడిన ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================

జనగణన కేవలం అంకెలు మాత్రమే కాదని.. భవిష్యత్ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు పునాదని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు.

===================

===================